జాలికథ

వేదుల వేంకటరమణమూర్తి

సాయంత్రం ఐదింటి నుండి కాలుగాలిన పిల్లిలా గదిలో పచార్లు చేస్తున్నాడు చంద్రశేఖర్. సిగరెట్టు మీద సిగరెట్టు పోటీ పడి కాలిపోతూ పొగులు పడుతున్నాయి. మనస్సులోని ఆలోచనలు ఎక్కడెక్కడికో పరిగెడుతున్నాయి. ఏ ఆలోచనా సరియైన పద్ధతిలోకి రావడంలేదు. టేబులు మీద తెల్ల కాగితాలు ఫేను గాలికి రెపరెపలాడుతూ ఒక్కొక్కటీ పక్కకు జరుగుతున్నాయి చంద్రశేఖర్ మనస్సులోని ఆలోచన్లలాగ.

కాగితా లన్నిటిని మళ్ళీ వరుసలో పెట్టి-దానిపై పేపర్ వెయిట్ వుంచి కుర్చీలో కూర్చుని మళ్ళీ ఆలోచిస్తున్నాడు. ఆరోజు కొన్న వార పత్రికను తెరచి మళ్ళీ ఆ ప్రకటన చదివాడు. "జాలి కథల పోటీ", కథ సారాంశం జాలి, కరుణ కలిగించేదిలా వుండాలి. పుస్తకాన్ని మూసేసి మళ్ళీ ఆలోచన్లలో పడ్డాడు.

ఎలా? ఏ కథ వ్రాయాలి? ఎవరిని కథా వస్తువుగా తీసుకోవాలి? రోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు అనేక రకాలుగా జాలి కలిగించే మనుష్యుల్ని చూస్తున్నాం. ఉదయం అంట్లు తోమడానికొచ్చే పనిమనిషి, రోడ్డుమీద పారేసిన ఎంగిలాకులలో మిగిలిన అన్నాన్ని తింటూ కనిపించే బిచ్చగాళ్ళ పిల్లలు, వికలాంగులు, గుడ్డివాళ్ళు, పొట్ట నింపుకోవటం కోసం కష్టాలు పడే గారడీవాళ్ళు.......యిలా ఎంతోమంది వున్నారు వీరిలో ఎవరిని కథా వస్తువుగా తీసుకోవాలి? కథకు ముగింపు ఎలావుంటే బావుంటుంది? యిలా ఎన్నో ఆలోచనలతో సతమతమవుతున్నాడు చంద్రశేఖర్.

తను ఓ పేరున్న రచయిత కాదుగాని, తను రాసిన కథలు చాలామటుకు ప్రచురించబడ్డాయి. కాని అవన్నీ ప్రేమ కథలు, సస్పెన్స్, క్రయిం కథలు వున్నాయి. ఇంతవరకు జాలి, కరుణ కలిగించే కథలు వ్రాయలేదు. అందుకే యిప్పుడింతగా ఆలోచించవలసి వస్తోంది.

అదేమిటో ఆ వార పత్రికవాళ్ళు యింకేదైనా టాపిక్ అడగొచ్చు కదా! ఏమీ దొరకనట్టు "జాలి" కథ లెందుకో? సరే ఏదో ఓ నిర్ణయానికి రావాలి అనుకుని కుర్చీలో కూర్చుని పెన్నును చేతిలోకి తీసుకున్నాడు.

"టక్......టక్.....టక్......" తలుపు చప్పుడయింది.

"అబ్బ! మంచి మూడ్ పాడు చేసారు కదా! ఎవరొచ్చారో.....?" అనుకుంటూ తలుపు తీశాడు చంద్రశేఖర్.

"గుడీవినింగ్!.......ఏమిటి చేస్తున్నావు" అంటూ గదిలోకి ప్రవేశించారు మురళీ, శ్రీకాంత్.

"రండి! రండి!....." అంటూ లోనికి ఆహ్వానించాడు చంద్రశేఖర్. మూడ్ చెడగొట్టేసారు కదరా! అని మనసులో అనుకుంటూ-

ఇద్దరికీ చెరో కుర్చీ చూపించి తానూ ఓ కుర్చీలో కూర్చున్నాడు చంద్రశేఖర్. టేబిల్‌మీద కాగితాలు, పెన్ను కనిపించడంతో........

"ఏమిటి? మళ్ళీ ఏదైనా కథ మొదలెట్టావా?" అడిగాడు శ్రీకాంత్.

"అవును! ఈరోజే ఈ వీక్లీలో "జాలికథ"ల పోటీ తాలూకు ప్రకటన పడింది. కథలు పంపటానికి సమయం కూడా చాల తక్కువగావుంది. సరే! యిప్పుడు మొదలెడితే కనీసం నాలుగైదు రోజులలో పంపగలనని అనుకుంటున్నాను" అన్నాడు చంద్రశేఖర్.

"ప్లాటు దొరికిందా యింతకీ" అడిగాడు శ్రీకాంత్.

"లేదింకా! దానిగురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు చంద్రశేఖర్.

"జాలి కథల పోటీ అంటున్నావు కాబట్టి చెబుతున్నాను. నేను ఓ నిజమైన సంఘటన చెప్తాను. ఆ సంఘటన నాలో ఎంతగా నాటుకు పోయిందో చెప్పలేను. అది తలచుకొన్నప్పుడల్లా నా హృదయాన్ని ఎవరో పిండుతున్నట్లని పిస్తుంది. అంతటి విషాద సంఘటన నా కెప్పుడూ ఎదురవ్వలేదు. అది నీకు చెబ్తాను. నీకు ఆ సంఘటన నచ్చితే దానిని ఆధారంగా తీసుకుని కథ వ్రాయి" అన్నాడు మురళి.

"అంత హృదయానికి హత్తుకుపోయిన సంఘటన అంటున్నావు. తప్పకుండా చెప్పు. నాకుగాని నచ్చితే తప్పకుండా కథ వ్రాస్తాను" అన్నాడు చంద్రశేఖర్.

"ఆ సంఘటన జరిగి యించుమించు రెండు సంవత్సరాలవుతోంది. అప్పుడు నేను విజయనగరంలో వుండేవాడిని. జరిగింది జరిగినట్టుగా చెబ్తాను. విను" అంటూ చెప్పడం మొదలెట్టాడు మురళి.

* * * * *

అప్పుడు నేను డిగ్రీ ఫైనలియర్‌లో వున్నాను. విజయనగరం కోట దగ్గరగా వున్న లక్ష్మపందిరి వీధిలో మా రూం. నాతో పాటే శ్రీనువాసు అనే మరొకడు అదే రూంలో వుండేవాడు.

ఓ రోజు మా రూంకి మా ఫ్రెండ్స్ ప్రసాద్, రవి అని మరో యిద్దరు స్టూడెంట్స్ వచ్చారు. అంతా కలిసి రాబోయే పరీక్షల గురించి మాట్లాడుకుంటున్నాం.

అంతలో మా యింటి తలుపు ఎవరో తట్టినట్లయింది. ముందు మా యింటి తలుపు కాదేమోననుకున్నాం. మళ్ళీ చప్పుడయింది. అందరమూ ఎంతో సీరియస్‌గా మాట్లాడుకుంటుంటే మధ్యలో ఎవడొచ్చాడురా అని విసుక్కుంటూ తలుపు తీసాడు రవి.

"బాబూ! కాస్త ధర్మం చేయి బాబూ!" అంటూ అడుక్కుంటున్నాడు ఓ బిచ్చగాడు.

"ఒరేయ్! పెద్ద సీరియస్‌గా తలుపు కొట్టి మరీ అడుక్కుంటున్నాడే! ఘరానా పెద్ద మనిషిలా..... వెళ్ళు వెళ్ళు....." కోపంగా అన్నాడు రవి

"అలా అనకుబాబూ! ఉదయం నుంచీ ఏమీ తినలేదు. ఆకలేస్తుంది" మళ్ళీ అడిగాడు ఆ బిచ్చగాడు

"నువ్వు వెళ్తావా లేదా........" అని అరచినట్టుగా అనడంతో అంతవరకూ రూంలో వున్న నేను, ప్రసాద్, శ్రీను బయటికి వచ్చి చూసాము.

ఆ వచ్చిన వ్యక్తికి సుమారు డెబ్బై ఏళ్ళుంటాయి. మనిషి పీలగా వున్నాడు అతని ముఖంలో కనిపిస్తున్న దైన్యం, అతని చిరిగిన బట్టలు అతని పేదరికాన్ని స్పష్టపరుస్తున్నాయి.

ఆకాశంలో గుడ్లురిమి చూస్తున్న రవి తాపం, భిక్షం వేయటానికి నిరాకరిస్తున్న మా రవి కోపం అతని పాలిట శాపమైకూర్చున్నాయి.

అతని అవస్థ చూస్తుంటే నాకు చాలా జాలేసింది

"పోన్లేరా! ఎంతో కొంత యిచ్చి పంపేద్దూ......." అన్నాను నేను.

"నువ్వేమిటిరా మధ్యలో....... యిటువంటి వాళ్ళకు భిక్షం వేయకూడదు. వీడిలో వున్న తక్కువేమిటిరా హాయిగా కళ్ళూ, కాళ్ళూ వున్నాయి. అడుక్కోవటమేమిటి ఖర్మ! హాయిగా పని చేసుకు బ్రతకొచ్చుగా" అన్నాడు ప్రసాద్

"అవున్రా! అసలు యీ ముష్టి వాళ్ళందరికీ యిదో సులువైన సంపాదన అయిపోయింది. మనదేశం యిలా పాడవటానికి కారణం వీళ్ళే. నిక్షేపంలా వున్నాడు. ఏదైనా పని చేసుకోవచ్చుగా.....అహాఁ చేయరు. తేరగా డబ్బులొస్తున్నప్పుడు పనెవడు చేస్తాడు.. మళ్ళీ ఒక్కొక్కరికి ఎంత బద్ధకమో..... చాల్లే! వెళ్ళవయ్యా వెళ్ళు" అన్నాడు రవి.

"బాబూ! మీరన్నదీ నిజమే! కళ్ళు కాళ్ళు వున్నాయి కనుక నన్ను అడుక్కోవద్దు అంటున్నారు. కానీ నాలో జవసత్వాలుడిగి పోయాయి బాబూ! నేను ముసలివాణ్ణి. మీలా వయసులో వుండేటప్పుడు నేను ఎవ్వరికీ తలొంచేవాణ్ణి కాదు. నాలో శక్తి సన్నగిల్లిపోయింది. పని చేయటానికి అస్సలు ఓపికలేదు. పోనీ నలుగురు పిల్లలకి చదువు చెప్పి నాలుగు రాళ్ళు సంపాదించుకుందామనుకున్నా నాకు చదువు రాలేదు. విధి నాతో ఆటలాడుకున్నాదు. నామీద దయతలచి నాకు ఎంతోకొంత ధర్మం చేయండి బాబూ!" అన్నాడా బిచ్చగాడు.

"పోన్లేరా! అతనితో వాదనెందుకు? మీకు తోచితే యివ్వండి. లేకపోతే లేదు.

ఇదిగోనయ్యా......తీసుకో...." అంటూ జేబులోంచి తీసిన పావలా అతని కివ్వబోయాను.

అంతే! శ్రీను నా చేతిలోని పావలాను గభాలున లాక్కున్నాడు. "నీకు బుద్ధుందా లేదా! అసలు బిచ్చమెత్తుకోవడాన్ని నేరంగా పరిగణిస్తే, నీలాటి భిక్షం వేసే వాళ్లను నేరస్తులనాలి. ఎందు కివ్వాలట అతనికి డబ్బు! నీకే కాదు జాలి! మాకూ వుంది. ఇదే ఓ గుడ్డివాడో, కుంటివాడో అయివుంటే మేమూ యిచ్చేవాళ్లం డబ్బు! కాని యిలాంటి వాళ్లకు యిస్తేమాత్రం సహించలేను" అన్నాడు శ్రీను.

తనకు రాబోయే ఆ పావలా డబ్బులు కూడా యివ్వకుండా చేసినందుకు శ్రీను మీద అతనికి ఓ రకమైన ఏహ్యాభావం కలిగింది. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఇంత నిర్దయ వుండకూడదు బాబూ! మీకివ్వాలని లేకపోయినా యిచ్చేవాళ్ళను ఎందుకు వద్దంటావు. పోన్లే! నీ మనసుకు తోచినట్లు వికలాంగులకే యివ్వు" అంటూ విరక్తిగా మా వైపుచూసి వెళ్ళిపోయాడు.

ఆస్థితిలో మరి నేను ఏం చేయాలో తోచలేదు. నేను ఆ ముసలాడి గురించే ఆలోచిస్తున్నాను. మిగతా ముగ్గురూ ఈరోజు మనమో ఆదర్శవంతమైన పని చేశామనుకుంటూ గర్వంగా ఆ విషయం గురించే చర్చించటం మొదలెట్టారు.

ఇంచుమించు ఓ నెల రోజుల తర్వాత మేం నలుగురం కలసి సినిమా కని న్యూ పూర్ణా టాకీసుకి వెళ్లాం. సినిమా ప్రారంభించటానికి యింకా సమయం వుండటంతో గంటస్తంభం దగ్గర నలుగురం నిలబడి మాట్లాడుకుంటున్నాం.

అంతలో ఓ భిచ్చగాడు మాదగ్గరకొచ్చి డబ్బులు అడిగాడు. ఆ వ్యక్తిని మేం నలుగురం చూసి నిశ్చేష్టులైపోయాం. ఆరోజు మా రూంకి వచ్చిన ఆ ముసలాడే. అయితే మేం ఆశ్చర్యపోవటానికి కారణం అతను అప్పటి స్థితిలో లేడు. అతని కుడికాలు తొడలవరకులేదు రెండు కర్రల సహాయంతో కుంటుకుంటూ వచ్చాడు. అతడు కూడా మమ్మల్ని పోల్చినట్లున్నాడు.

"బాబూ! మీరా రోజు అన్నట్లు నేను నిజంగానే కుంటివాణ్ణి అయిపోయాను. ఇప్పుడు మీ కోరిక నెరవేరినట్లేకదా! ఇప్పుడైనా కాస్త ధర్మం చేయండి" అన్నాడు మమ్మల్నిచూసి.

నా మనస్సు నిజంగా ఎంత బాధ పడిందో తెలియదు. అతన్ని ఆ స్థితిలో చూడలేకపోయాను. మా కెవ్వరికీ నోట మాటరాలేదు. నేనే ముందుగా తేరుకుని. . ..

"నీ కాలుకి ఏమయింది? ఎలా పోయిందది?" అడిగాను అతనిని.

"ఆరోజు మీ యింటికి వచ్చి డబ్బులడిగాను కదాబాబూ! అదేరోజు నేను రైల్వేస్టేషన్లో ప్లాట్‌ఫారంమీద అడుక్కుందికి వెళ్ళాను. అప్పుడు నేను పట్టాలు దాటుతూవుంటే అనుకోకుండా ఓ యింజను వచ్చి గుద్దేసింది. చావుతప్పింది కానీ....... నా కాలు శాశ్వతంగా పోయింది. పోనీలెండిబాబూ. నిజానికి నేను బాధపడలేదు. మీలాగే నన్నెంతమంది అన్నారు కళ్ళూ, కాళ్ళూవుండి అడుక్కోవడమెందుకని. ఇదీ ఒకందుకు మంచిదేమోననిపించింది" అన్నాడు కన్నీళ్ళుపెట్టుకుంటూ.

మొదటిసారి అతడికి డబ్బులివ్వకుండా

వాదించిన నా ఫ్రెండ్స్ ముగ్గురూ అతని మాటలను, జరిగిన ప్రమాదమును విని చలించిపోయారు.

అసలది ప్రమాదమా? లేక ఆ రోజు మా మాటలని, యింకా ఎంతో మంది అన్న మాటలను భరించలేక, కళ్ళూ, కాళ్ళూ వుంటే ఎవ్వరూ భిక్షంవేయరని నిర్ణయించుకుని కోరి ప్రమాదానికి ఎదురెళ్ళాడా? అతనన్నప్రకారం అది ప్రమాదమని అనుకోవాలి. కానీ నాకు నమ్మకం కలగడంలేదు. ఏది ఏమైనప్పటికీ ఆ ప్రమాదంతో మాకు సంబంధం వుందనిపించింది.

అందరమూ కలిసి అతనికి పదిరూపాయ లిచ్చాము. అతను మా అందరికీ నమస్కరించి వెళ్ళిపోయాడు. అతడికి జరిగిన ప్రమాదాన్ని గురించి మాట్లాడుకున్నాం చాలాసేపు.

ఇక మా కెవ్వరకు సినిమా చూడాలని మూడ్ లేక టిక్కెట్లు వాపసయిచ్చి రూంకు వెళ్ళిపోయాము.

ఆ రోజు నుండి అతను మా కెన్నోసార్లు కనిపించాడు. మాకెంత తోచితే అంత సహాయం చేస్తుండేవాళ్ళం.

నాకిక్కడ ఉద్యోగం వచ్చినప్పటి నుండి క్రమేపీ అతడిని మరిచిపోయాను. కానీ ఆ సంఘటన మాత్రం హృదయంలో నిలిచిపోయింది.

గత ఆదివారం నేను జగదాంబ సెటర్లో నిల్చుని సిటీబస్ కోసం వెయిట్ చేస్తుంటే అతడే మళ్ళీ కనిపించాడు. అతడు కూడా కొన్నాళ్ళ క్రితం విజయనగరం నుండి వచ్చేసానని చెప్పాడు.

అతడు బిచ్చగాడే అయినా నా కెందుకో

జాలికథ

అతనిమీద చెప్పలేని అభిమానం ఏర్పడింది. ప్రస్తుతం ఈ వూర్లోనే వున్నాడు" అని తనకు ఎదురైన సంఘటనను వివరంగా చెప్పి పూర్తి చేసాడు మురళి.

"నువ్వు చెప్పిన సంఘటన నిజంగా చాలా బాగుంది. జాలి కథల పోటీకి సరిగ్గా సరిపోయేటట్టుగా వుంది. తప్పకుండా దీనిని ఆధారంగా తీసుకుని కథ వ్రాస్తాను" అన్నాడు చంద్రశేఖర్ నిశ్చయంగా.

* * * * *

"మురళీ! గుడ్ న్యూస్! నువ్వు చెప్పిన సంఘటన ఆధారంగా తీసుకుని వ్రాసిన కథకు మొదటి బహుమతి వచ్చింది! ఇదిగో ఇందులో కథ పడింది" అంటూ ఆ వారపత్రికను మురళి కిచ్చాడు చంద్రశేఖర్.

"కంగ్రాట్స్! నాకు ముందే తెలుసు చందూ! నీలో ఆ కవి హృదయంవుందని. దీనికి తప్పకుండా ప్రైజ్ వస్తుందని ముందే ఊహించాను. అనుకున్నట్టే జరిగింది. రియల్లీ అయామ్ వెరీ హ్యాపీ" అంటూ కరచాలనం చేసి వారపత్రికలో పడ్డ అతని కథను చదవడం మొదలెట్టాడు మురళి.

కథ చివరిలో అతను చేసిన ముగింపు నిజంగా అద్భుతంగా వుందనిపించింది. ఆనాటి సంఘటన గుర్తొచ్చి, లేక ఆ ముసలాయన గుర్తొచ్చి లేక చంద్రశేఖర్ కథనంలో వున్న గొప్పదనమోగాని మురళి కళ్ళనుండి అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చేసాయి.

రెండువారాల తరువాత చంద్రశేఖర్ బహుమతిగా తన కొచ్చిన చెక్కుని మురళికి చూపించాడు.

"మురళీ నువ్వు ఆనాడు చెప్పిన సంఘటనే నా కథకు వూపిరినిచ్చింది. అందుకే ఈ బహుమతిని నీకు పార్టీరూపంలో యిద్దా మనుకున్నాను. పద! నీకు ఏది కావాలంటే అది యిప్పిస్తాను" అంటూ మురళిని పార్టీకై బలవంతంచేసి లేవదీసాడు.

ఇద్దరూ అప్సర హోటల్ వైపు దారితీసారు. దారిలో కథపై తన అభిప్రాయాన్ని వివరిస్తూ చెబుతున్నాడు మురళి.

ఉన్నట్టుండి సడన్‌గా "చందూ! ఒక్క నిముషం! ఆ దూరంగా వెళ్ళిపోతున్నాడు చూసావా! అతడే నే చెప్పిన వ్యక్తి. అతడికి జరిగిన సంఘటనే నేను నీకు చెప్పాను" అంటూ దూరంగా మరో సందులోకి వెళ్ళిపోతున్న బిచ్చగాడ్ని చూపించాడు మురళి.

కానీ అప్పటికే మరో సందులోకి వెళ్ళిపోవటంతో చంద్రశేఖర్ ఆ బిచ్చగాడ్ని చూడలేకపోయాడు.

"నువ్విక్కడే వుండు చందూ! అతడ్ని తీసుకొస్తాను" అంటూ ఆ బిచ్చగాడ్ని తీసుకు వచ్చేందుకు వెళ్ళాడు మురళి.

* * * *

చప్పట్లుకొడుతూ దూరంగా వెళ్ళిపోతున్న ఆ బిచ్చగాడ్ని పిలిచాడు మురళి. ఆ బిచ్చగాడు మురళిని చూసి ఆగాడు.

నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు వరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేక పోవుట, సమస్త చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స ! పోస్టు ద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు": ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6-30 గం. వరకు, ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేద భిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్,

పార్కురోడ్, గుడివాడ - 521301

ఫోన్స్ : 522 & 540

సినిమా రంజని

చందా వివరములు

విడి ప్రతి వెల – రెండు రూపాయిలు

	ఏజంటు	పోస్టు
3 నెలలు —	రూ.26-00	రూ. 28-00
6 నెలలు —	రూ.52-00	రూ. 56-00
సంవత్సరం –	రూ.104-00	రూ.112-00

చందా పైకమును "ఆంధ్రపత్రిక, గాంధీనగరము, విజయవాడ-3" పేరిట యం.వో లేదా డ్రాఫ్టు పంపించ వలెను.

– సర్క్యులేషన్ ప్రమోషన్ మేనేజర్

"ఏం బాబూ! ఎందుకు పిలిచారు?"

"నీ కారోజు చెప్పాను గుర్తుందా! మా ఫ్రెండ్ నీ మీద కథ వ్రాసి బహుమతి పొందాడని. అతడు అక్కడ నిలబడివున్నాడు. నీకు పరిచయం చేద్దామని పిలిచాను. నాతో రా" అంటూ బిచ్చగాడితో కథా విశేషాలు చెబుతూ నడిపించుకుంటూ చంద్రశేఖర్ నిలబడ్డ స్థలంవేపు తీసుకువస్తున్నాడు మురళి.

దూరంగా కిళ్ళీబడ్డీ దగ్గర సిగరెట్లు కొనుక్కుంటున్నాడు చంద్రశేఖర్.

"అదుగో! ఆ నీలం షర్టు వేసుకున్నాడే అతడే మా ఫ్రెండ్. పేరు చంద్రశేఖర్!" అంటూ దూరంనుంచే అత దిని చూపించాడు మురళి.

అతడిని చూస్తూనే ఆ బిచ్చగాడి ముఖంలో రంగులు మారిపోయాయి. ఓ రకమైన కోపం, అసహ్యం, వుద్వేగంతో వణికిపోయాడు. అక్కడనుండి మరో అడుగు ముందుకు వేయలేదతడు.

"ఏం? ఆగిపోయావేమిటి?" అడిగాడు మురళి.

"అతడేనా బాబూ! నువ్వు చెప్పిన రచయిత! గొప్ప జాలి హృదయం కలవాడని. అవును! చాల గొప్ప దయగలవాడు. అతడిలో వున్న జాలి, కరుణ, అభిమానం అన్నీ నాకు తెలుసుబాబూ! నేను అతడి దగ్గరకు రాను. అల్లాటి పాపాత్ముడి దగ్గర దేహీ! అని నేనడగను. వద్దు బాబూ! వద్దు!" అంటూ ఆవేశంగా వెనక్కితిరిగి చాల తొందరగా నడవడం మొదలెట్టాడు.

అతడిని అనుసరించాడు మురళి.

* * * * *

ఆ బిచ్చగాడ్ని తీసుకొస్తానని వెళ్ళిన మురళి ఎంతకీ రాకపోయేసరికి విసుక్కుంటూ, కొస్సేపు మురళి వెళ్ళిన దారిలో వెతుక్కుంటూ తన రూంకు చేరుకున్నాడు చంద్రశేఖర్.

రూమ్ తలుపు తెరచిచూసిన తనకి నేలపై ఓ కవరు వుండటం చూసి తెరచి చదివాడు.

డియర్ చంద్రశేఖర్,

ఆ బిచ్చగాడ్ని తీసుకొస్తానని వెళ్ళిన నేను ఎంతకీ రాకపోయేసరికి విసుక్కొని వుండివుంటావు కదూ! నిజమే! అది సహజం.

అయితే ఆ బిచ్చగాడ్ని కలుసుకున్నాక అతని నుండి మరికొంత సమాచారం నాకు తెలిసింది. ఈ విషయాలు ముందే తెలిసుంటే నీవు ఆ "జాలి కథ" వ్రాయకముందే చెప్పివుండేవాడిని. అప్పుడు నీ కథకు మరింత బలం చేకూరేది.

అయినా ఆ విషయాలు నీకు తెలియజేస్తున్నాను. కనీసం తరువాత వ్రాయబోయే కథకైనా వుపయోగపడొచ్చు.

ఆ బిచ్చగాడు ఒకప్పుడు మధ్య తరగతి కుటుంబీకుడు. ఒక మగ బిడ్డకు తండ్రయిన అతడు భార్యను పోగొట్టుకున్నాడు. తల్లీ, తండ్రీ తనే అయి ఆ మగపిల్లవాడ్ని పెంచి చదివించాడు.

అందరిలాగానే ఆ పిచ్చి తండ్రి తన కొడుకో మంచి వుద్యోగస్తుడవుతాడని, మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని పొంది తనను వృద్ధాప్యంలో ఆదుకుంటాడని వూహించాడు. అవి కన్నవారి కలలు కదా!

కానీ పెంచి పెద్దచేసిన తండ్రిని తనకు గుదిబండలా వూహించి ఓనాడు అర్ధరాత్రి యిల్లొదిలి పారిపోయాడు ఆ రెక్కలు వచ్చిన కొడుకు.

కొడుకు భవిష్యత్తుకోసం అహర్నిశలు కష్టపడిన ఆ తండ్రికి కొడుకు వెళ్ళిపోయాక మిగిలినవి జవసత్వాలుడిగిన వృద్ధాప్యమూ, గంజికి నోచుకోని పేదరికమూను.

కోపమొచ్చి యిల్లొదిలి పోయిన కొడుకును వెదుక్కుంటూ, కొడుకు పనిచేస్తున్న ఆఫీసు తెలుసుకుని వెళ్ళాడా అభాగ్యుడు.

కన్న తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవలసిన ఆ కొడుకు, కసాయివాడిలా ఆఫీసు బంట్రోతుకి చెప్పి తరిమేసాడు.

దిక్కుతోచని ఆ వృద్ధుడు యాచకుడయ్యాడు. పదిమంది ముందు ఛీ!......ఛో......అనే ఛీత్కారాలని భరించలేక కళ్ళూ, కాళ్ళూ వుంటే గంజికూడా పోయటానికి ఎవరూ ముందుకు రావటంలేదని తలచి తను ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కానీ విధి వక్రించింది...... అతనికి చావు తప్పింది...... కానీ కాలు పోయి వికలాంగుడయ్యాడు.

ఇన్నాళ్ళూ నేను అప్పుడు జరిగిన ప్రమాదం యాదృచ్ఛికం అనుకున్నాను. కానీ అది స్వయంకృతం అని నిన్ననే తెలిసింది.

కన్న కొడుకు నిరాదరణ వల్ల ఆ తండ్రి యాచకుడు, వికలాంగుడూ అయ్యాడు.

ఇంతకీ ఎవరో తెలుసా ఆ వ్యక్తి? "నిన్ను కన్న తండ్రి!"

ఇట్లు
మురళి

ఉత్తరాన్ని పూర్తిచేసిన చంద్రశేఖర్ నిశ్చేష్టుడయ్యాడు. టేబిల్‌పైనున్న వారపత్రిక వారు పంపిన చెక్కు గాలికి రెపరెపలాడుతూ వెక్కిరిస్తున్నట్లనిపించింది. □

త్వరలో ప్రారంభం!

కొత్త శీర్షిక

ఆయుర్వేద వైద్య సలహాలు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకి ఆరోగ్య సంబంధమైన సమస్యలపై ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధాల తయారీ సంస్థ చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వైద్య నిపుణులు సమాధానాలు ఇస్తారు. పాఠకులు తమ ప్రశ్నలని "ఆయుర్వేద వైద్య సలహాలు" శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–520003 అనే చిరునామాకి ఈ కింద ఇచ్చిన కూపన్ జతపరిచి పంపవచ్చును. ఒక కూపన్‌తో ఒక ప్రశ్నని మాత్రమే పంపాలి.

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఆయుర్వేద వైద్య సలహాలు

ప్రశ్న: ....

....

....

పంపినవారి పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

....